పల్లెల అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలి

- కమ్యూనిస్టు సర్పంచులు ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి
- బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ జెండాలే వేరు - విధానాలు ఒక్కటే
- సిరిసిల్లలో సిపిఎం సర్పంచుల అభినందన సభలో జాన్ వెస్లీ


సిపిఎం సర్పంచులను సత్కరిస్తున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 29 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో పల్లెల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధుల కేటాయింపు పై ప్రధాన చర్చ జరగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నేతలు వ్యక్తిగత దూషణల చుట్టూ ప్రక్రియలు చేస్తూ ప్రజాసమస్యలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో గెలిచిన సిపిఎం సర్పంచులు గ్రామాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గెలిచిన సిపిఎం సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభ శుక్రవారం సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడారు. పల్లె సీమలు పచ్చగా ఉండాలంటే పల్లెల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, దీనిపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ జరగాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం అధికారంలో ఉన్నప్పుడు 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు నేరుగా 50 శాతం నిధులు కేటాయించి పల్లెల అభివృద్ధికి కృషి చేసిందని చెప్పారు. కేరళలో సిపిఎం ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా పంచాయతీ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం సర్పంచ్‌లకు నిధులు సకాలంలో ఇవ్వకుండా పంచాయతీల అభివృద్ధిని బలహీనపరిచిందని చెప్పారు. ప్రస్తుత అధికారంలో ఉన్న ప్రభుత్వం సరైన సమయంలో గ్రామాలకు సరిపడా నిధులు కేటాయించాలని అన్నారు. ముఖ్యమంత్రి పెద్ద పంచాయతీలకు రూ.పది లక్షలు చిన్న పంచాయతీలకు రూ. 5 లక్షలు ఇస్తామని చెప్పడం వాస్తవం నీటి మూటలు కావొద్దన్నారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు వ్యక్తిగత దూషణలకు పోటీ పడటం కాదు.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోటీ పడాలని కోరారు. బిజెపి ఎంపి బండి సంజయ్ వ్యక్తిగత దూషణలు, విద్వేషాలే తమ రాజకీయ విధానంగా మాట్లాడుతున్నారని చెప్పారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకుంటారని చెప్పారు. బీజేపీకి బలహీన వర్గాల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి బలహీన వర్గాల రిజర్వేషన్లకు పాటుపడాలని చెప్పారు. గతంలో ఐదు ఆదర్శ పంచాయతీలను నాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఎంపిక చేస్తే ఆ ఐదు గ్రామాలకు సిపిఎం సర్పంచులు ఉన్నారని చెప్పారు. రాబోయే స్థానిక ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మునిసిపల్ ఎన్నికల్లో సిపిఎం సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో సిపిఎం కార్మిక వర్గ సమస్యల పైనే కాదు పల్లె ప్రాంత ప్రజల హృదయంలో ఎర్రజెండా ఎగిరిందన్నారు. వీర్నపల్లి సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ సర్పంచ్ గన్నేరం వసంత, గర్జనపల్లి ఉపసర్పంచ్ న్యాత మోహన్, వార్డు సభ్యులు గుండెల్లి కల్యాణ్, లింగంపల్లి అనిల్, రజనీకాంత్, హరిక తదితరులను శాలువాలు కప్పి మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు కేవీఎస్ఎన్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, మల్లారపు అరుణ్ కుమార్, కోడం రమణ జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, గురజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్, అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, శ్రీరాముల రమేష్ చంద్ర వివిధ ప్రజా సంఘాల నాయకులు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

18న సిపిఐ వందేళ్ల ఉత్సవాల భారీ సభ



- సిఎం రేవంత్‌రెడ్డి, వామపక్షాల నేతలు, 40 దేశాల ప్రతినిధులకు ఆహ్వానం
- 19న వామపక్ష పార్టీల జాతీయ నాయకులతో సదస్సు : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ వందేండ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో కనివినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కమ్యూనిస్టులు ఎక్కడ అనేవారికి కనువిప్పు కలిగేలా, ఎర్ర సముద్రాన్ని తలపించేలా ఐదు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. సౌహార్ద సందేశం నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, అలాగే వామపక్ష పార్టీల జాతీయ నాయకులను, 40 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. 19న వామపక్ష పార్టీల జాతీయ నాయకులతో సదస్సు, ఆ తర్వాత సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ బహిరంగ సభను విజయవంతం చేసి మనిషి, శ్వాస, ఆకాశం, భూమి, నీరు, నిప్పు, గాలి ఉన్నంత వరకు కమ్యూనిజం సిద్ధాంతం ఉంటుందనే విషయాన్ని చాటుతామని చెప్పారు. తాము ఎవరికి భయపడబోమనీ, ఎంత మందిని చంపుతారో తేల్చుకుందామని అన్నారు. అయితే సంకెళ్లు లేదంటే కమ్యూనిస్టు రాజ్యం అని స్పష్టం చేశారు. బహిరంగ సభను జయప్రదం చేసేందుకు జిల్లాల వారీగా జాతాలను నిర్వహిస్తామనీ, ఎపి, తమిళనాడు, కేరళ, వివిధ రాష్ట్రాల నుంచి తమ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకాబోతున్నట్టు తెలిపారు.

10 నుంచి బడులకు సంక్రాంతి సెలవులు?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు వచ్చేనెల పదో తేదీ నుంచి సంక్రాంతి పండుగ సెలవులను ప్రకటించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. అదేనెల 18వ తేదీ వరకు ఈ సెలవులను వర్తింపజేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అకడమిక్ కేలెండర్ ప్రకారం వచ్చేనెల 11 నుంచి 15వ తేదీ వరకు అంటే ఐదు రోజులపాటు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లో వచ్చేనెల పది నుంచి 18వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. తెలంగాణలో ఐదు రోజులపాటే సంక్రాంతి సెలవులు ప్రకటించడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. అందులోనూ వచ్చేనెల 14న భోగి, 15న మకర సంక్రాంతి, 16న కనుమ పండుగ ఉన్నది. కానీ అకడమిక్ క్యాలెండర్‌లో మాత్రం 16న కనుమ పండుగ ఉన్నా అదే రోజు నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని ప్రభుత్వం ప్రకటించడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో సంక్రాంతి సెలవులను పొడిగించాలన్న డిమాండ్ వస్తున్నది. ఈ నేపథ్యంలో వచ్చేనెల పది నుంచి 18 వరకు తొమ్మిది రోజులపాటు సంక్రాంతి సెలవులు ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలకు వచ్చేనెల 11 నుంచి 18 వరకు ఎనిమిది రోజులపాటు సంక్రాంతి సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. వచ్చేనెల 19న పాఠశాలలు, జూనియర్ కాలేజీలు పున:ప్రారంభమవుతాయి.

రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

- రైతు, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 'మోడీ' కుట్ర
- లేబర్ కోడ్‌లు, విద్యుత్, విబి జి ఆర్‌ఏ ఎం జి, విత్తన చట్టాలు వెంటనే రద్దు చేయాలి
- రైతు ఉద్యమ స్ఫూర్తితో రద్దయ్యే వరకు పోరాడాలి : బి వెంకట్



క్రాస్ రోడ్స్ వద్ద నిరసన తెలుపుతున్న బి వెంకట్ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను, రైతులను, వ్యవసాయ కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి తీసుకువచ్చిన ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను, విబి జి ఆర్ఎంఎం జి, విత్తన, విద్యుత్ సవరణ చట్టాలను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక, అఖిల భారత కిసాన్ సభ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ ఆఫీసు నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో జరిగిన సభకు సీఐటీయూ నగర కార్యదర్శి జె. కుమార్ స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బి. వెంకట్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ.. నాలుగు నల్ల లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి కనీస హక్కులు లేకుండా చేస్తోందని మండిపడ్డారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టాలు రద్దయ్యే వరకు రైతు ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలు సంయుక్తంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రాముడి పేరుతో రాజకీయం..

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నదని, రాముడు పేరుతో రాజకీయాలు చేస్తూ పేద ప్రజల నోట్లో మట్టి కొట్టే విధానాలను తీసుకొస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ అన్నారు. ఈ బిల్లులను వ్యతిరేకించకపోతే దేశంలో ఉన్న పేద, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, కర్షకులకు రాబోయే కాలంలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రమాదకరమైన బిల్లులకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు చేయాలి

ఈ బిల్లులకు వ్యతిరేకంగా గ్రామపంచాయతీల్లో రాష్ట్రంలో గెలిచిన మెజార్టీ కాంగ్రెస్ సర్పంచులతో సిఎం రేవంత్ రెడ్డి తీర్మానం చేయించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో నిరసనలు చేపట్టి దీనిని దేశవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. ప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు సునీత, టిపిఎస్‌కె గౌరవాధ్యక్షులు జి రాములు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, పిఎన్ఎం రాష్ట్ర నాయకులు జగ్గరాజు, సిఐటియు నగర అధ్యక్షులు ఎం.దశరథ్, కోశాధికారి కె.అజయ్ బాబు, ఉపాధ్యక్షులు జి. రాములు, జి.నరేష్, సహాయ కార్యదర్శులు సి.మల్లేష్, టి మహేందర్, ఎ రాజు, నగర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర శాసనసభ కార్యదర్శిగా రేండ్ల తిరుపతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర శాసనసభ నూతన కార్యదర్శి రేండ్ల తిరుపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కార్యదర్శి ఛాంబర్‌లో ప్రస్తుత కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు నుంచి తిరుపతి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి తిరుపతికి ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించినంతరం ఆయన... స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి కార్యదర్శిగా వి నరసింహాచార్యులు కొనసాగుతారు.

స్టోవ్‌క్రాఫ్ట్ డిసెంబర్ సేల్ ప్రారంభం



ఆస్ట్రేలియా జాజ్ భారతీయ శాస్త్రీయ నృత్యం సమ్మోహనం

ప్రజాశక్తి - కల్చరల్

వైవిధ్య వినూత్న సంగీత నృత్య కార్యక్రమం రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ చైతన్య ఆర్ట్స్ థియేటర్స్ రాగ బై వారధి నిర్వహణలో వైష్ణవి నాట్య కేంద్రం సౌజన్యంతో ఓషన్ విండ్స్ శీర్షికన ఆస్ట్రేలియా దేశ సంప్రదాయ సంగీతం జాజ్ విభిన్న వాయిద్యలతో బివి బాల సాయి, యు పి రాజు, అడ్రియన్ షరీఫ్, టోనీ హిక్స్, డాక్టర్ సురేష్ విద్యనాథన్, చంద్రకాంత్, శ్రీకాంత్ సహకరించగా నట్టువాంగం వైష్ణవి సాయినాథ్ చేశారు. రాజేశ్వరి సాయినాథ్ తన శిష్య బృందంతో కలిసి వైస్ట్రన్ వాయిద్యాలతో ఉన్న కర్నాటక సంగీతంకు అనుగుణంగా లయ బద్ధం అడుగులు కదుపుతూ అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్ వి సుబ్రమణ్యం కంద మోహన్ పాల్గొని కళాకారులను సత్కరించి మాట్లాడారు. భాషా సరిహద్దులకు అతీతంగా కళలు ప్రజలను కలుపుతాయని అన్నారు. ఫ్యూజిఎన్ సంగత నృత్య సమ్మేళనం విశిష్ట ప్రయోగం అన్నారు. చైతన్య ఆర్ట్స్ థియేటర్స్ కెకె రాజా స్వాగతం పలుకుతూ గత నలభై ఏళ్లపైగా చైతన్య ఆర్ట్స్ థియేటర్స్ ఎన్నో వైవిధ్య భరిత కార్యక్రమాలనీ సేవా కార్యక్రమాలను నిర్వహించామని కొంత కాలం విరామం తర్వాత ప్రారంభిచామని చెప్పారు.

'నీళ్ల'పై నిగ్గు తేలుద్దాం..

- జిల్లాలు, ప్రాజెక్టుల వారీగా సిద్ధంకండి
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు సిఎం దిశానిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి సంబంధించిన నీటి వాటాలపై ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ అవాస్తవాలు, అసత్యాలు ప్రచారం చేస్తోన్న నేపథ్యంలో ఈనెల 29 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఆ పార్టీపై ఎదురుదాడికి దిగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశా నిర్దేశం చేశారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఒప్పందాలపై అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో సిద్ధం కావాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రిపరేషన్‌లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఎంపిలకు కూడా పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పిపిటి) ఇప్పించాలని సిఎం నిర్ణయించారు. ఆ మేరకు అన్ని వివరాలను తెప్పించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆయన కోరారు. ప్రజా ప్రతినిధులకు అర్థమయ్యేలా సూటిగా, స్పష్టంగా, విడమరిచి చెప్పాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు అధికార పార్టీ వర్గాలు తెలిపాయి. సిఎం సూచనల మేరకు కొత్త ఏడాది ప్రారంభం రోజైన జనవరి ఒకటిన హైదరాబాద్ బేగంపేటలోగల ప్రజా భవన్‌లో మంత్రి ఉత్తమ్... పిపిటి ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రజాభవన్ అధికారులు తెలిపారు. పిపిటికి విధిగా హాజరు కావాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. జనవరి ఒకటిన షరా మామూలుగా ఉండే పార్టీలు, వేడుకలకు వెళ్లాల్సి ఉంటుందని, అందువల్ల ఆ రోజు కాకుండా మరో రోజు పీపీటీ ఇవ్వాలంటూ పలువురు ప్రజా ప్రతినిధులు కోరినప్పటికీ సిఎం తిరస్కరించారని సమాచారం. అసెంబ్లీలో సీరియస్‌గా చర్చించాల్సిన అంశం కాబట్టి, జనవరి ఒకటిన ఎవ్వరికీ మినహాయింపునిచ్చేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్టు తెలిసింది. కాగా జనవరి 2న కృష్ణా జలాలపై, 3న గోదావరి జలాలపై శాసనసభలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ చర్చలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభిస్తారు. సిఎం రేవంత్ రెడ్డి చర్చలో పాల్గొంటూ అనేక విషయాలను సోదాహరణంగా వివరించనున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ హీటెక్కటం ఖాయంగా కనబడుతోంది. కాగా ఈనెల 29న శాసనసభ, మండలి శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఆ రోజు కార్యకలాపాల తర్వాత జనవరి ఒకటికి ఉభయ సభలు వాయిదా పడనున్నాయి.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కెసిఆర్ పార్టీ..

- భవిష్యత్తు అంతా కాంగ్రెస్ ప్రభుత్వానిదే
- సర్పంచుల సన్మాన సభలో మంత్రి వివేక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ (బిఆర్ఎస్) పార్టీ ఫామ్‌హౌస్‌కు పరిమితమైపోయిందని.. ఆ పార్టీ కోసం మాట్లాడే అవసరం లేదని భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనని ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సర్పంచ్‌లుగా గెలుపొందిన వారికి శుక్రవారం సన్మానం నిర్వహించారు. దీనికి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. మూడుసార్లు ఓట్లు వేసిన గజ్వేల్ ప్రజలకే కనిపించని కెసిఆర్.. రెండేళ్ల తర్వాత బయటకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తోలు తీస్తానని అనడం సిగ్గుచేటన్నారు. గజ్వేల్ అభివృద్ధి విషయంలో సిఎం రేవంత్ రెడ్డితో ఇప్పటికే చర్చించామన్నారు. 2028లో గజ్వేల్ గడ్డపై తిరిగి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీలో గెలుపొందిన సర్పంచులకు నిధుల కొరతలేదని, సిఎం రేవంత్‌తో మాట్లాడి నియోజకవర్గానికి నిధులు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. నియోజకవర్గ సర్పంచులతో త్వరలో ముఖ్యమంత్రి సమావేశం ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని అందులో ఇందిరమ్మ ఇల్లు, సిమెంటు రోడ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఆరు గ్యారెంటీల పథకాలను, ఉచిత బస్సు వంటి వాటిని అందులో పొందుపరచాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక హుస్నాబాద్, నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, నాయకులు రాజు, రంగారెడ్డి, ఎలక్షన్ రెడ్డి, భూమిరెడ్డి, చిట్టి దేవేందర్ రెడ్డి, నక్క రాములు గౌడ్, గాడి పల్లి శ్రీనివాస్, సారిక శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను రాజకీయంగా చైతన్యం చేస్తాం

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముదిరాజ్‌ను రాజకీయంగా చైతన్యపరుస్తామని పశుసంవర్ధక, పాడి పరిశ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడా, యువజన సర్వీసుల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ముదిరాజ్ సామాజిక తరగతి నుంచి స్థానిక సంస్థల్లో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను ఈ నెల 30న రవీంద్రభారతిలో సన్మానించనున్నట్టు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో సన్మాన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో ముదిరాజ్ సామాజిక తరగతికి చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బిసిలనందరిని రాజకీయంగా ఒకవేదికపైకి తీసుకొనివచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ల వాటా కల్పించేందుకు తమ ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డీసీసీ అధ్యక్షులు మోతె రోహిత్, సంజీవ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు

చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్ సౌకర్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తక్కువ స్పేస్‌లో సౌకర్యవంతంగా విశ్రాంతి తీసుకునేందుకు రైల్వేశాఖ స్లీపింగ్ పాడ్‌లను అందుబాటులోకి తెస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో వీటిని ప్రారంభించిన అధికారులు.. తాజాగా ఈ సౌకర్యాన్ని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లోనూ ఏర్పాటు చేశారు. ఈ మేరకు చర్లపల్లి స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్‌ల వీడియోను దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం 'ఎక్స్'లో షేర్ చేసింది. రైలు పెట్టెలో పడకలను తలపిస్తూ లాకర్ల సదుపాయంతో కూడిన ఈ స్లీపింగ్ పాడ్‌లు ఆకట్టుకొంటున్నాయి. మధ్యతరగతి ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా వీటి ధరలను నిర్ణయించారు. రెండు గంటలకు రూ.200 కాగా.. ఆరు గంటలకు రూ.400, 12 గంటలకు రూ.800, 24 గంటలకు రూ.1200గా ధరలను నిర్ణయించారు.

కొత్త జిఒతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టమూ జరగదు

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో


రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన అక్రెడిటేషన్ మార్గదర్శకాలు వృత్తిపరమైన జర్నలిస్టులను నష్టపర్చవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి వివక్షత లేకుండా అందరికీ సంక్షేమ చర్యలు వర్తించటంతో పాటు ఇంకా మెరుగైన చర్యలు చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి యోచిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వపు అక్రిటేషన్ ఉత్తర్వులు ఉర్దూ జర్నలిస్టుల పట్ల అనుసరించిన వివక్షతను, చిన్న పత్రికల పట్ల చూపిన చిన్న చూపును తెలంగాణ హైకోర్టు కొటేసిన అంశాలను గుర్తుచేసారు. ఈ నేపథ్యంలోనే వాటిని కొత్త జిఒలో మార్పు చేసిన విషయాన్ని వెల్లడించారు.నూతన జిఒపై కొందరు ఉద్దేశ్యపూర్వకంగా అవాస్తవాలను వెల్లడిస్తూ, వక్రీకరిస్తూ సంక్షేమ చర్యలు విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని చెబుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ ఇవి వర్తిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాలపై అవసరమైతే వివరణ కోరొచ్చని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమ చర్యల పట్ల ముఖ్యమంత్రితో, సమాచార శాఖ మంత్రితో ఎప్పుడైనా మాట్లాడడానికి అవకాశాలుంటాయని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా ఓ రాజకీయ ఎత్తుగడతో కొన్ని శక్తులు ఆందోళన చేయాలని తలపెట్టడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల పట్ల, వారి సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వం సానుకూల పరిష్కారానికి వెళ్తుంది తప్పా, గత ప్రభుత్వం మాదిరిగా వివక్షత చూపే అవకాశమే లేదని స్పష్టం చేశారు. నూతన జిఒపై పనిగట్టుకుని కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని విశ్వసించొద్దని వర్కింగ్ జర్నలిస్టులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్మికులు, రైతులు, కార్మికులపై పగబట్టిన మోడీ

- నాలుగు లేబర్ కోడ్‌లతో తీవ్ర నష్టం
- రైతులకు నష్టం చేసేలా విత్తన చట్ట సవరణ
- వాటిని రద్దు చేసేవరకూ ఉద్యమం : చుక్క రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికులు, రైతులు, కార్మికులపై మోడీ ప్రభుత్వం పగబట్టిందని.. వారి హక్కులను కాలరాసి కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తున్నదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మండిపడ్డారు. రైతులకు నష్టం చేసేలా విత్తన చట్ట సవరణ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంగారెడ్డిలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య భవన్ నుంచి ఐబీ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, విబి జి ఆర్ఎంఎం జి పేరుతో ఆ చట్టాన్ని బలహీనం చేశారని, ఇది చాల దారుణమైన విషయమని అన్నారు. కొత్తం చట్టంతో 40 శాతం రాష్ట్రం, 60శాతం కేంద్రం పరిధిలోకి తెచ్చిందన్నారు. దీంతో రాష్ట్రాలపై మరింత భారం పడి.. కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. నూతనంగా అమల్లోకి తెచ్చిన లేబర్ కోడ్‌లతో.. కార్మికులు తిరగి బానిసలుగా మారే ప్రమాదమున్నదన్నారు. కనీసం సంఘాలు కూడా పెట్టుకునే అవకాశం లేకుండా చేశారన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన ర్యాలీలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య పాల్గొని మాట్లాడారు. సూర్యాపేటలోని రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణకేంద్రంలో నూతన చట్టం ప్రతులను దహనం చేశారు. నల్లగొండలోని సుభాష్ విగ్రహం దగ్గర నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలకేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని ప్రజా పోరాటాలతోనే కాపాడుకోవాలని నినాదాలు చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట విబి జి ఆర్ఎంఎం జి బిల్లు పత్రాలను దహనం చేశారు.



మిమిక్రి కళ భీష్ముడు నేరెళ్ల వేణు మాధవ్

ప్రజాశక్తి - కల్చరల్

మిమిక్రీ కళలో భీష్ముడు వంటి వారు నేరెళ్ల వేణు మాధవ్ అని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతునకెందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా నేరెళ్ల వేణు మాధవ్ యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి పాల్గొని మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో పుట్టి మిమిక్రీ కళాకారుడుగా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారని చెప్పారు. నెహ్రూతో పాటు దేశ ప్రముఖ నాయకుల సమక్షంలో తన కళా ప్రతిభ ప్రదర్శించి వారిచే ప్రశంసలు అందుకున్నారని వివరించారు. మిమిక్రీ కళలో కేంద్ర ప్రభుత్వ పద్మ అవార్డ్ పొందిన ఏకైక కళాకారుడని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళాజనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై వ్యక్తిత్వ వికాస నిపుణుడు జివిఎన్ రాజు సత్య నగేష్ బాల కథా రచయిత చొక్కాపు రమణ ప్రముఖ మిమిక్రీ కళాకారులు మల్లం రమేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్ నగర పాలనలో నూతనదశ !


- జిహెచ్‌ఎంసి పునర్వ్యవస్థీకరణతో సులభంగా, వేగంగా అందనున్న పౌర సేవలు
- 12 జోనల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిహెచ్‌ఎంసి పరిధిలో 20 పురపాలికలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు కలిపి మొత్తం 27 పట్టణ స్థానిక సంస్థలను (యుఎల్‌బిలు) విలీనం చేయడంతో హైదరాబాద్ (జిహెచ్‌ఎంసి) నగర పురపాలన నూతన దశ సంతరించుకుంది. విలీనంతో జిహెచ్‌ఎంసి పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుంచి 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించగా, విస్తీర్ణం, జనాభా పరంగా దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జిహెచ్‌ఎంసి అవతరించిందని అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి జీహెచ్‌ఎంసీ ప్రకటన విడుదల చేసింది.

వార్డుల పునర్వ్యవస్థీకరణ.. 150 నుంచి 300కు పెంపు

పునర్వ్యవస్థీకరణలో భాగంగా నగర విస్తరణకు అనుగుణంగా వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీని ద్వారా ప్రజాప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేయడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం తద్వారా విస్తరించిన పట్టణ ప్రాంతాల్లో పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రభుత్వం తెలిపింది.



జోన్లు, సర్కిళ్ల పునర్నిర్మాణం

పెరిగిన పరిపాలనా బాధ్యతలను సమర్థంగా నిర్వహించేందుకు జిహెచ్‌ఎంసిని ఆరు జోన్ల నుంచి 12 జోన్లు, 30 సర్కిళ్ల నుంచి 60 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరించారు.

ప్రస్తుతం 1.34 కోట్లకు పైగా జనాభా ఉన్న నగరానికి ఈ మార్పులు వికేంద్రీకృత పాలనను మరింత బలోపేతం చేయనున్నాయి.

జోనల్ కమిషనర్ల నియామకం

నూతన పరిపాలనా నిర్మాణానికి అనుగుణంగా, జిహెచ్‌ఎంసికి 12 మంది జోనల్ కమిషనర్లను ప్రభుత్వం నియమించింది. వీరు శుక్రవారం బాధ్యతలు స్వీకరించడంతో, పునర్వ్యవస్థీకరించిన జోన్లలో పరిపాలన తక్షణమే అమల్లోకి వచ్చింది. దీనివల్ల క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, పాలన మరింత బలోపేతం కానుంది.

సమతుల్య, సుస్థిర పట్టణ అభివృద్ధి దిశగా

పన్నులు, సరళీకృత పరిపాలనతో జిహెచ్‌ఎంసి ఆర్థిక, సంస్థాగత సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఈ పునర్వ్యవస్థీకరణతో సమతుల్య పట్టణ అభివృద్ధి, మెరుగైన విపత్తుల,వరదల నిర్వహణ, నగర కేంద్రం నుంచి చివరి ప్రాంతాల వరకూ సమాన మౌలిక వసతుల కల్పన జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. విస్తరించిన, పునర్వ్యవస్థీకరించిన జీహెచ్‌ఎంసీ సమర్థ పాలన, సమగ్ర, సుస్థిర పట్టణ వృద్ధి అనే లక్ష్యాలతో హైదరాబాద్ భవిష్యత్తుకు ఒక ఏకీకృత విధానాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రపంచస్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నట్టు పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు.

ప్రభాకర్‌రావు కస్టడీ పూర్తి

- సెఫాలజిస్టు ఆరా మస్తాన్‌ను విచారించిన సిట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్‌ఐబి మాజీ ఐజీ ప్రభాకర్‌రావు సిట్ కస్టడీ శుక్రవారంతో ముగిసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావును శుక్రవారం ఉదయం అధికారులు విడుదల చేశారు. దీంతో ఆయన జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయం నుంచి తన ఇంటికి వెళ్లిపోయారు. గత 14 రోజులుగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావును తమ కస్టడీలో ఉంచుకుని సిట్ విచారించిన విషయం విదితమే. చివరి దశ విచారణలో ప్రభాకర్‌రావు నుంచి ఆశించిన మేరకు కొంత సమాచారాన్ని రాబట్టగలిగామని సిట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా, ఈ కేసులోనే ప్రముఖ సెఫాలజిస్టు ఆరా మస్తాన్‌ను సిట్ అధికారులు విచారించారు. గతంలోనూ ఆయన్ను విచారించినప్పటికీ ఈ మారు తమకున్న మరికొన్ని సందేహాలను తీర్చుకోవడానికి ఆరా మస్తాన్‌ను సిట్ బృందం విచారించింది. గతంలో తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని ఆరామస్తాన్ సిట్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. విచారణలో తాను అధికారులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలనీ, అవసరమైతే తిరిగి వచ్చి విచారణకు సహకరిస్తానని ఆరా మస్తాన్ తెలిపి వెళ్లిపోయారు.



భార్యకు నిప్పంటించి హత్య చేసిన భర్త

- తిలక్‌నగర్‌లో దారుణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన భర్తను హైదరాబాద్ నల్లకుంట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తూర్పు జోన్ అదనపు డిసిపి జె నర్సయ్య, ఎసిపి జగన్, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్ నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన కస్తాల వెంకటేశ్వర్లు నల్లకుంట తిలక్ నగర్ ప్రాంతంలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. వెంకటేష్ తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని తరచూ వేధిస్తూ గొడవపడేవాడు. దీని కారణంగా వారి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో భార్యపై వెంకటేశ్వర్లు పగ పెంచుకున్నాడు. ముందస్తు పథకం ప్రకారం శివం రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి పెట్రోల్ కొనుగోలు చేశాడు. ఈ నెల 23న రాత్రి నిద్రలో ఉన్న భార్యపై పెట్రోల్ పోసి అగ్గిపెట్టెతో నిప్పు పెట్టాడు. తీవ్రంగా కాలి గాయాల పాలైన ఆమెను వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 24న మృతి చెందారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సిసి ఫుటేజ్ ఆధారంగా సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో నిందితుడిని గురువారం అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు శ్రీనివాస్, డిఐ రాములు, కానిస్టేబుల్ సాయి పాల్గొన్నారు.

రైతు భరోసా కొనసాగుతోంది

- సోషల్ మీడియాలో దుష్ప్రచారం నమ్మొద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతోన్న ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించింది. ఇందులో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఇలాంటి వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, దురుద్దేశంతో కూడినవేనని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

"రైతు భరోసా కింద తెలంగాణలో దాదాపు 65 లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడంలేదు. ప్రస్తుతం సంబంధిత జిల్లా కమిటీలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూసేందుకు క్షేత్రస్థాయి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నాయి. అలాగే, ఆర్థిక శాఖ సైతం లబ్ధిదారులకు చెల్లింపులు చేసేందుకు వారి జాబితాను సిద్ధం చేసి తిరిగి తనిఖీ కూడా నిర్వహిస్తోంది. రైతు భరోసా నిలిపివేస్తున్నారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఇది లబ్ధిదారులను తప్పుదోవ పట్టించేదిగా ఉంది" అని పేర్కొంది.

శాటిలైట్ మ్యాపింగ్ గురించి..

"వాణిజ్య వినియోగంలో ఉన్న భూములకు సంబంధించి రైతు భరోసా ప్రయోజనాలు పొందుతున్న వారిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జర్మన్ టెక్నాలజీ సాయంతో 'శాటిలైట్ మ్యాపింగ్' నిర్వహిస్తోంది. 2024లో చేపట్టిన ఒక గ్రౌండ్ సర్వే ప్రకారం దాదాపు నాలుగు లక్షల ఎకరాల భూమి.. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ పరిధిలో వాణిజ్య వినియోగంలో ఉంది. ఈ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా ప్రతి లబ్ధిదారుడి వద్ద ఎంత భూమి సాగు విస్తీర?లో ఉందో నిర్ధారించొచ్చు. రైతు భరోసా పొందుతున్న భూమి రియల్ ఎస్టేట్ వెంచరా..?కొండా , రోడ్డా, ఫాంహౌసా అనే విషయాన్ని ధ్రువీకరించేందుకు కూడా ఈ మ్యాపింగ్ ఉపయోగపడుతుంది. మ్యాపింగ్ ప్రక్రియ అనేది ఫీల్డ్ డేటాను రికార్డులతో ధ వీకరించడానికి మాత్రమే.

రైతు భరోసా పథకం కింద గతేడాది దాదాపు రూ.8,500 కోట్ల నుంచి రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రైతు భరోసా విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించలేదు. రైతులు రబీ/ఖరీఫ్ కాలాల్లో పంటలు పండించవచ్చు. అలాంటి వారు కూడా ఈ పథకానికి అర్హులే. ఒక సీజన్‌లో ఒకే పంట పండించిన రైతులకూ ఆర్థిక సహాయం అందిస్తున్నాం.

ఎసి పేలి బాలుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎసిలో మంటలు చెలరేగి రెండేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన హైదరాబాద్ కాచిగూడలో జరిగింది. కాచిగూడ సుందర్‌నగర్‌లోని ఓ ఇంట్లో శుక్రవారం సాయంత్రం ఎసిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గదిలో ఉన్న రెండేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారకస్థితికి చేరుకున్న బాలుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాల్సిందే : కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలతో కెసిఆర్ సమావేశమయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల తదుపరి కార్యాచరణపై నేతలతో చర్చించారు.

" తెలంగాణకు కాంగ్రెస్ ఎప్పుడూ ద్రోహమే చేస్తోంది. బిఆర్ఎస్‌కు తప్ప.. మరే ఇతర పార్టీకి తెలంగాణపై పట్టింపులేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాల్సిందే. ప్రజల్లోకి వెళ్దాం. ఉద్యమాన్ని నిర్మిద్దాం. నీటి హక్కులు పరిరక్షించుకునే బాధ్యత బీఆర్ఎస్‌పైనే ఉంది. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీ వేదికగా వివరిద్దాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహాన్ని అసెంబ్లీ వేదికగా చెబుదాం" అని పార్టీ నేతలతో కెసిఆర్ అన్నట్టు సమాచారం. ఈ నెల 29న శాసనసభకు కెసిఆర్ హాజరయ్యే అవకాశముందని, అసెంబ్లీ సమావేశాల తర్వాత బిఆర్ఎస్ బహిరంగ సభలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు.

బిఆర్ఎస్‌లో చేరిన జడ్చర్ల కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నవాబుపేట మండలం వెంకటేశ్వర తండాకు చెందిన సుమారు 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సిద్ధిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి నివాసంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన బాబు నాయక్, ఉప సర్పంచ్ తావూరియా, ఆరుగురు వార్డు సభ్యులు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర తండా సర్పంచ్ సేవ్యా నాయక్, కొల్లూరు మాజీ సర్పంచ్ రాజు, నాయకులు చందర్ నాయక్ పాల్గొన్నారు.

ఢిల్లీకి మూటలు మోయడమే ముఖ్యమంత్రికి తెలుసు

- దమ్ముంటే హామీల అమలుపై శపథం చెయ్
- కెసిఆర్ ప్రెస్‌మీట్‌కే సిఎంకు ముచ్చెమటలు
- రేవంత్‌రెడ్డిపై కెటిఆర్ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నాకు రేవంత్‌రెడ్డిని తిట్టాలని లేదు కానీ బాధ అనిపిస్తది. లీడర్ అనేది, తెలంగాణ తెచ్చిన నాయకుడు, రెండు సార్లు ముఖ్యమంత్రి అనేది కూడా పక్కకు పెట్టండి. మా నాయన కదా?. మా నాయనను తిడితే కొడుకుకు రేషం రాదా?. పీకల దాకా కోపం ఉంది. దొరికితే ఎడమకాలి చెప్పు తీసుకుని కొట్టాలనుంది. ఏం చేయాలి. ఇది ప్రజాస్వామ్యం. ఎక్కువ మాట్లాడితే వీడికి అహంకారం ఉంది అంటారు.'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు దోసల అనిల్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఎక్కడి నుంచి వచ్చారు, ఆయన ప్రయాణం ఎక్కడి నుంచి మొదలైందని ప్రశ్నించారు. రోడ్ల మీద పెయింటింగ్ వేసుకునేటోడని అన్నారు. జీవితంలో ఎవరైనా చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయికి రావాలనీ, అందులో తప్పు లేదనీ, కానీ మంచి పనులు చేసి రావాలని చెప్పారు. లంగ పనులు, దొంగ పనులు చేసి బ్యాగులు, సంచులు మోసి దిరికిపోయి జైలుకు వెళ్లి అదేదో పెద్ద గొప్ప విషయం అన్నట్టు పోజులు కొడుతున్నారని ఆరోపించారు. ఢిల్లీకి మూటలు మోస్తూ పైసలిచ్చి ముఖ్యమంత్రి పదవిని తెచ్చుకున్నారని అన్నారు. సీఎం పదవిలో ఉన్న వారికి సంతోషం ఉండాలి కానీ కేసీఆర్‌పై రోజూ ఏడుపు ఎందుకని ప్రశ్నించారు. ఆయన మాట్లాడే భాష ఏందనీ, తమకు రాదా?అని అడిగారు. తాను హైదరాబాద్ గల్లీల్లో పెరిగిన వాడిననీ, ఉర్దూ, హిందీ, తెలుగు, ఇంగ్లీష్‌లో పొల్లు పోకుండా తిట్టే తెలివి నాకు ఉందన్నారు. కానీ సీఎం కుర్చీకి గౌరవం ఇస్తున్నామని చెప్పారు. కేసీఆర్‌ను బయటకు రా అంటే వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి పోయిండని అన్నారు. దానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముచ్చెమటలు పట్టినయనీ, చలిజ్వరం వచ్చిందని చెప్పారు. ఇప్పుడు అసెంబ్లీకి రమ్మంటున్నారని అన్నారు. బయటకు వస్తేనే తట్టుకోలేకపోయినవు, అసెంబ్లీకి వస్తే గుండె ఆగి చస్తావని రేవంత్‌రెడ్డినుద్దేశించి వ్యాఖ్యానించారు. తాను గుంటూరులో చదివితే రేవంత్‌రెడ్డికి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. ఆయన మాత్రం ఆంధ్రా నుంచి అల్లున్ని తెచ్చుకోవచ్చా?అని అడిగారు. ఆయన పేరు చిట్టినాయుడు కాకుండా భీమవరం బుల్లోడు అని పెడితే బాగుంటుందన్నారు.

మా నాయన పేరు బరాబర్ చెప్పుకుంటా

తండ్రి పేరు చెప్పుకుని బతుకుతున్నా అని రేవంత్‌రెడ్డి అంటారనీ, తమ నాయన గొప్పోడు, తెలంగాణ తెచ్చిన మొగోడు, మొనగాడు బరాబర్ చెప్పుకుంటా ఇందులో తప్పేముందని కెటిఆర్ అన్నారు. తాను చెప్పుకోకుంటే ఇంకెవరు చెప్తారని చెప్పారు. రేవంత్‌రెడ్డి కూడా సక్కటి పనులు చేస్తే ఆయన పిల్లలు, మనవడు కూడా ఆయన పేరు చెప్పుకుంటారని సూచించారు. రేవంత్‌రెడ్డి శపథం చేయాల్సింది వ్యక్తుల మీద కాదనీ, ఇచ్చిన హామీల అమలుపై అని అన్నారు. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారో శపథం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వలేనోడు, కోటి మందిని కోటీశ్వరులను ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆడ పిల్లల పెండ్లికి తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలని కోరారు. ఆసరా పెన్షన్ రూ.నాలుగు వేలకు ఎప్పుడు పెంచుతారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీమంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కె కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీరో డ్రగ్స్ విధానమే లక్ష్యం

- హైదరాబాద్ సిపి విసి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ కట్టడిపై నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. 'జీరో డ్రగ్స్' విధానమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపట్టాలని నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ఆయన హెచ్-న్యూ, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, వెస్ట్‌జోన్, సీసీఎస్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డ్రగ్స్ వినియోగాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. " నగరంలోని పబ్‌లు, హోటళ్లు రెస్టరెంట్లు, ఈవెంట్లు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా బృందాలను మోహరించాం. ప్రధాన వేదికలతో పాటు సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీలపైనా నిఘా ఉంటుంది. గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి కదలికలను నిశితంగా గమనిస్తున్నాం. డ్రగ్స్ సరఫరా చేసేవారు, వాటికి అలవాటు పడిన వారి జాబితా సిద్ధం చేసి వారిపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించాం. నగరానికి కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఆరా తీస్తున్నాం" అని సిపి తెలిపారు.

వేడుకల సమయపాలనపై హెచ్చరిక

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పబ్‌లు, హోటళ్ల, రెస్టరెంట్లు కచ్చితంగా రాత్రి ఒంటి గంటకే మూసివేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే వాటి లైసెన్సులను రద్దు చేస్తామని తేల్చిచెప్పారు. మైత్రీవనం, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్, కెబిఆర్ పార్క్ సహా జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, బారికేడింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ వేడుకలపై కూడా నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. నిఘా పేరుతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు.

కెటిఆర్‌కు సంస్కారం లేదు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్ బ్యూరో : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్‌కు అసలు సంస్కారమే లేదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి మీడియా పాయింట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్ పై కేటీఆర్ మాట్లాడిన తీరు చూసి యావత్ తెలంగాణ ప్రజలు సిగ్గుపడుతున్నారని తెలిపారు. అమరవీరుల త్యాగాల పునాదులను అడ్డుపెట్టుకుని పదవులు పొంది.. అడ్డగోలుగా రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. అడ్డగోలు దోపిడితో రూ.లక్షల కోట్ల అప్పును తెలంగాణ ప్రజల మీద రుద్దారని తెలిపారు. అందుకే కంటోన్మెంట్, జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఎన్నికల లగాయతు.. మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో ప్రజలు మీకు చావు దెబ్బ కొట్టారని గుర్తు చేశారు. సిఎంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే... రాష్ట్రంలో తిరగనీయబోమని హెచ్చరించారు. డబ్బు అహకారంతో ఏది పడితే అది మాట్లాడొద్దనీ, సొంత చెల్లి, బావ ఫోన్లు ట్యాప్ చేసిన కెటిఆర్‌కు రేవంత్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని గుర్తు చేశారు.

చేనేత రంగంలో నూతన అధ్యాయం

- సింగిడి కలెక్టివ్ బ్రాండ్‌ను ఆవిష్కరించిన కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ చేనేత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే దిశగా పర్యావరణ హితమైన వస్త్రధారణను ప్రోత్సహిస్తూ రూపొందించిన సింగిడి కలెక్టివ్ నూతన ఫ్యాషన్ బ్రాండ్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ నేల స్వభావానికి అద్దం పట్టేలా పూర్తిగా ప్రకృతి సిద్ధమైన రంగులతో సంప్రదాయ చేనేత నైపుణ్యంతో ఈ బ్రాండ్ రూపుదిద్దుకోవడం విశేషం. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డ ఎప్పుడూ కొత్త దనానికి వేదికగా నిలుస్తుందన్నారు. ఇక్కత్ నుంచి గొల్లభామ చీరల వరు నేతన్నల నైపుణ్యం అద్భుతమని అన్నారు. ఈ వారసత్వాన్ని నేటి యువత అభిరుచులకు తగ్గట్టుగా మార్చుతూ పర్యావరణానికి హాని లేని రీతిలో సింగిడి కలెక్టివ్ ముందడుగు వేయడం హర్షణీయమని చెప్పారు. వ్యాపారమే కాకుండా నేతన్నలకు అండగా నిలుస్తూ సామాజిక బాధ్యతతో యువత ఇటువంటి స్టార్టప్‌లను స్థాపించడం గర్వకారణమని అన్నారు. చేనేత రంగంలో ఇఇ నూతన అధ్యాయమని చెప్పారు. లింగ భేదం లేకుండా ఆధునిక డిజైన్లతో రూపొందిన ఈ వస్త్రాలు www. singidicollective.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఈ కార్యక్రమంలో సింగిడి కలెక్టివ్ వ్యవస్థాపకులు విశ్వసారథి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సర్పంచులదే బాధ్యత!

- నూతన కరదీపికలో కఠిన నిబంధనలు
- బాధ్యతలు పెరిగాయి.. నిధులిస్తారా?
- నూతన పాలకవర్గంలో భయాందోళనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నిధులు సకాలంలో ఇస్తారో లేదో తెలియదు.. కానీ పనులు చేయమంటున్నారు. గతంలో చేసిన పనులకు గత ప్రభుత్వం నిధులివ్వలేదు. ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా మరిన్ని బాధ్యతలు పెంచారు... అభివృద్ధి పనులు జరగకున్నా మాదే బాధ్యత అంటున్నారు. వరుసగా గ్రామ సభలు జరగకున్నా తొలగిస్తామంటున్నారు. నిధులు ఇవ్వకున్నా బాధ్యతగా ఉండాలంటే ఎలా' అని కొత్తగా కొలువుదీరిన గ్రామ పంచాయతీల పాలకవర్గాల్లో చర్చ నడుస్తోంది. తెలంగాణలో నూతన పంచాయతీ పాలకవర్గాలు కొలువుదీరిన నేపథ్యంలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 ఆధారంగా రూపొందించిన నూతన కరదీపికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. గ్రామాభివద్ధిని లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ మార్గదర్శకాలు సర్పంచుల్లో బాధ్యతలను పెంచడమే కాకుండా, భయాలను కూడా పెంచాయన్న అభిప్రాయం వారిలో వ్యక్తమైంది. బాధ్యతల నుంచి పారిపోయే ప్రసక్తే లేదని, సంబంధం లేని వాటిని తమకు అంటకట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదు అంటున్నారు.

సూర్యాపేట జిల్లాలోని 486 గ్రామ పంచాయతీల్లో నూతన పాలకవర్గం కొలువుదీరిన వెంటనే గ్రామాల్లో పనులకు శ్రీకారం చుట్టాయి. అయితే కొత్త కరదీపిక అమలుపై జిల్లా స్థాయిలో ఆసక్తితో పాటు ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. కరదీపిక ప్రకారం సర్పంచులు తప్పనిసరిగా తమ స్వగ్రామంలోనే నివసిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. గ్రామానికి దూరంగా ఉంటూ విధులను నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్ వేటు తప్పదని స్పష్టంగా ఉంది. సర్పంచి అందుబాటులో లేని పరిస్థితుల్లో ఉప సర్పంచ్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించనున్నారు. నిధుల వినియోగంలో సర్పంచ్, ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకాన్ని తప్పనిసరి చేయడం కీలక అంశంగా మారింది. అయితే జిల్లాలోని అనేక గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు అందని పరిస్థితుల్లో అభివృద్ధి పనులు చేయలేకపోయినా బాధ్యత వారిదే బాధ్యత అనడంతో సర్పంచుల్లో భయం నెలకొంది.

కరదీపికలో పేర్కొన్న విధుల ప్రకారం గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుధ్యం, చెత్త సేకరణ, మురుగు కాలువల నిర్వహణ, వీధిదీపాల సంరక్షణ, ఆస్తి పన్నుల వసూలు, జనన, మరణాల నమోదు, హరితహార లక్ష్యాల అమలు ఇవన్నీ సర్పంచుల ప్రధాన బాధ్యతలుగా మారాయి. ముఖ్యంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటించి, నాటిన మొక్కల్లో కనీసం 85 శాతం బతికేలా చూడాలన్న నిబంధన ఉంది. అవి వనరుల లేమి ఉన్న గ్రామాల్లో అమలు సాధ్యమా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుసగా గ్రామసభలు నిర్వహించకపోయినా, నిధుల దుర్వినియోగం జరిగిందని తేలినా జిల్లా కలెక్టర్ సర్పంచిని పదవి నుంచి తొలగించే అధికారం కలిగి ఉన్నారు. తొలగింపునకు గురైన వారు ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులవుతారు. 'గ్రామాభివృద్ధి చేయాలన్న తపన ఉంది. కానీ నిధులు, సిబ్బంది, అధికారుల సహకారం లేకుండా అన్ని బాధ్యతలు మా మీదే వేస్తే ఎలా?' అని పలువురు సర్పంచులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, ప్రభుత్వం ఈ నూతన కరదీపిక ద్వారా గ్రామ పాలనలో అవినీతి తగ్గి, జవాబుదారీతనం పెరుగుతుందని భావిస్తోంది. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామ పంచాయతీ ప్రజాస్వామ్యానికి పునాదని చెప్పుకుంటున్నందున సర్పంచులపై పెరిగిన బాధ్యతలకు తగిన నిధులు, వనరులు, సిబ్బంది సహకారం అందిస్తేనే ఈ కరదీపిక లక్ష్యాలు నెరవేరుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాడిరైతులపై 'దాణా'భారం

- 10 నుంచి 15 శాతం మేర ధర పెరుగుదల
- ఒక్కో ఆవుకు రోజుకు రూ.210, గేదెకు రూ.140కిపైనే ఖర్చు
- దాణా సబ్సిడీలను ఎత్తేసిన ప్రభుత్వ డెయిరీ సంస్థలు
- డెయిరీలో లీటర్ ఆవు పాలకు దక్కుతున్నది రూ.33 నుంచి రూ.35 లోపే
- గేదె పాలకు అందుతున్నది రూ.50 నుంచి రూ.56 లోపే



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాడి రైతులపై 'దాణా'భారం పడుతోంది. పాల ఉత్పత్తిలో కీలకమైన ఆవులు, గేదెలకు ఉపయోగించే దాణా ఉత్పత్తులపై పది నుంచి 15 శాతం మేర ఇటీవల రేట్లు పెరిగాయి. ఓవైపు దాణా ధరలు పెరగడం... మరోవైపు ప్రభుత్వ డెయిరీలు సబ్సిడీపై దాణా సరఫరాను అమలు చేయకపోవడం... మరోవైపు డెయిరీలు పాల ధరలను తగ్గించడం వెరసి పాడి రైతులు నష్టాల్లోకి కూరుకుపోతున్నారు. గతంలో విజయ డెయిరీ సంస్థ రైతులకు 50 శాతం సబ్సిడీ మీద లిక్విడ్ దాణాను సరఫరా చేసేది. మినరల్ మిక్స్‌డ్ పౌడర్‌ను 20 శాతం సబ్సిడీపై ఇచ్చేది. అయితే, రెండేళ్లుగా మినరల్ మిక్స్‌డ్ పౌడర్‌ను ఇవ్వట్లేదు. లిక్విడ్ దాణా సరఫరాను ఆపేసింది. మిగతా డెయిరీలదీ ఇదే పరిస్థితి. బహిరంగ మార్కెట్‌లో 20 కేజీల పౌడర్‌కు రూ.నాలుగు వేలు ఉంది. అది సబ్సిడీ ఉన్నప్పుడు రైతులకు రూ.రెండు వేలకే దక్కేది. లిక్విడ్ పది లీటర్లకు రూ.1800 వరకు ఉంది. ఇప్పుడు ఆ భారం రైతులపై పడుతోంది. సగటున ఒక్కో ఆవు రోజుకు ఏడు కేజీల దాణా తింటుంది. సగటున ఒక్కో కేజీకి రూ.30 వేసుకున్నా రోజుకు రూ.210 ఖర్చవుతున్నది. ఒక ఆవు రోజుకు యావరేజ్‌గా 14 లీటర్ల వరకు పాలు ఇస్తుంది. డెయిరీలు లీటర్ ఆవు పాలకు కనిష్టంగా రూ.30, గరిష్టంగా రూ.35కి మించి ఇవ్వడం లేదు. డెయిరీ సంస్థకు ఒక ఆవుకు సంబంధించి రైతు పోసే పాలకు గానూ రోజుకు యావరేజ్‌గా 420 నుంచి 490 మధ్య దక్కుతున్నవి. ఒక ఆవుపై రోజువారీగా దాణా ఖర్చుపోగా మిగులుతున్నది రూ.210 నుంచి రూ.250 మాత్రమే. అంటే రైతులకు కూలి కూడ గిట్టని పరిస్థితి. అదే గేదె పాలకు అయితే లీటర్‌కు రూ.50 నుంచి రూ.56 వరకు పాడి రైతులకు డెయిరీ సంస్థలు ఇస్తున్నాయి. ఒక్కో గేదెకు సగటున దాణా ఖర్చు 120 అవుతుండగా..పాల ద్వారా రైతులకు ఒక గేదెపై సగటు అందుతున్నది రూ.220 మాత్రమే. అంటే ఖర్చులుపోను గేదెపై రూ.100 మాత్రమే మిగులుతున్నాయి. దీంతో చాలా మంది డెయిరీలను వదిలేస్తున్నారు. రైతులు ఈ విధంగా నష్టపోతుండగా పాల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో వినియోగదారుని దగ్గరకు వచ్చేసరికి పాల రేట్లు పెరిగిపోతున్నాయి. పట్టణాల్లో ప్రాంతాలను బట్టి లీటర్ బర్రె పాలకు రూ.80 నుంచి రూ.100 పలుకుతుండగా, గ్రామాల్లో రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. పాలప్యాకెట్ల ధర లీటర్‌కు(ఆయా డెయిరీ సంస్థలను బట్టి ఒక రూపాయి అటు ఇటుగా) రూ.60 ఉంది. దీంతో పాల ఉత్పత్తి , డెయిరీల నిర్వహణ ద్వారా తమకు పెద్దగా ఏమీ మిగలట్లేదని రైతులు వాపోతున్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ పాడి రైతులకు ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయట్లేదని ఎత్తిచూపుతున్నారు. ప్రమాదాల్లో, వివిధ రోగాలతో బర్రెగానీ, ఆవుగానీ చనిపోతే రైతు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టపోవాల్సి వస్తున్నది. పాల సొసైటీ నిర్వహణ గ్రామాల్లో అస్తవ్యస్తంగా తయారైంది. డెయిరీలు పాల పాలరేట్లను పెంచాలి..దాణాను సబ్సిడీపై

సాదం రమేశ్, విజయ పాడి రైతుల పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్

దాణా ఖర్చులకు అనుగుణంగా పాడి రైతులు నష్టపోకుండా పాల రేట్లను పెంచాలి. మినరల్ మిక్చర్, కాల్షియం, నట్టల మందులను రైతులకు 50 శాతం సబ్సిడీలపై అందజేయాలి. పాడి పశువులకు గడ్డి కట్టర్ మిషన్‌లను, పాలు పిండే మిషన్లను 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలి. దాణాను డెయిరీల ద్వారా సబ్సిడీపై అందించాలి. పాడి పశువులకు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలి.